
సుభద్ర
అవసరాల రామకృష్ణారావు

"ఆమె పెద్ద పెద్ద పుస్తకాలేం చదువుకోలేదు. కాలేజీ చదువు చదవలేదు. అయినా ఆమెకు అలవడని ఉత్తమ సంస్కారం లేదు. ఓటమి లేని జీవితం ఆమెది. స్వార్థ మెరుగని త్యాగం ఆమెది"

గదిబైట తమ్ముడు తలుపు కొడుతున్నాడు. విశాల విసుక్కుంటూ తలుపు తీసింది.

'అదేమిటే చిన్నక్కా యింకా అలా ఉన్నావ్? కాలేజీకి రావా?'

'ఊహుం నువ్వు పో' అని విశాల తిరిగి తలుపు వేసేసుకుంటూంటే అమ్మ వచ్చింది.

'కాలేజీకి వెళ్ళకపోతే పోయావు, భోజనానికి రా - వడ్డించేశాను.'

'మళ్ళీ ఏం భోజనం?'

'బాగుంది యిందాకట్టీ భోజనమే? నెయ్యన్నంలోనే చెయ్యి కడిగేసుకున్నావ్'

'నా కాకలి లేదే' విశాల మొహం అటువైపు తిప్పేసుకుంది. అమ్మ బలవంతాన్ని యిటు తిప్పింది. రెండు బుగ్గలమీదా కన్నీటి చారికలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. విశాల అమ్మను కౌగలించుకుని భోరని ఏడ్చేసింది. అమ్మ కూడా ఏడ్చింది.

'ఏం చేస్తాం తల్లీ, దానికి రోజులు నిండిపోయాయి. నువ్వూరుకో - నాకన్న నీ దుఃఖం ఎక్కువదా?' విశాల బలవంతంగా కన్నీళ్లు ఆపుకుంది. లేడీస్ క్లబ్ బంట్రోతు వచ్చాడు.

'రాత్రి ప్రోగ్రాంకి అందరికీ యిన్విటేషన్లు పంపాలిట - మీ ఆజ్ఞ లేనిదే...'

'ఉండు' అంది విశాల. గబగబా లోపలికి వెళ్ళి నోట్‌బుక్‌లోంచి ఒక తెల్ల కాగితం చింపింది. దానిమీద నాలుగు ముక్కలు ఏవో గబగబా రాసింది. వాడికిచ్చింది.

'దీన్ని సెక్రటరీగారి కియ్యి' వాడు వెళ్లిపోయాడు. అమ్మ తలుపువేసి వచ్చింది.

'అదేమిటే?'

'నా ప్రెసిడెంట్‌షిప్‌కి రాజీనామా'

అమ్మ తెల్లబోయింది. ఇలాంటి సరిస్థితుల్లో ఆవిడ కారణం అడగదల్చుకోలేదు.

'సరేగాని భోజనానికి రా'

'నే రాను'

'అయితే నేనూ తిననూ...'

'మానెయ్' విశాల తలుపు వేసేసింది. ఎంతగా దుఃఖపడితే ఆమె మనస్సు తేలికవుతుందో ఆమెకే అర్థంకాలేదు. 'నేను చచ్చిపోను - చచ్చిపోను - బతికేఉంటాను' అన్న మాటలు జ్ఞాపకం రాగానే ఆమె తలగడాలో తల దూర్చుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. నాన్న భోజనానికి వచ్చినట్టున్నారు. అమ్మ ఆయనతో అంటున్నట్టుంది-

'ఇదేమిటండీ యీ విశాలా? క్లబ్బులో దీన్ని ఎన్నుకున్నారని అవాళ అంతలా మురిసిపోయిందా? ఇవాళ ఫుసుక్కున రాజీనామా యిచ్చేసింది! ఇవాళ గుప్పెడన్నమయినా తినలేదు, కాలేజీకి వెళ్ళలేదు, బాగుందా? చూస్తే దీనికి మతిపోయినట్టుంది' 'లేదు జ్ఞానోదయమయింది' అనుకుంది విశాల. కాని ఆమె మనస్సు వికసించేసరికి అంతా మించిపోయింది. ఆమె స్టేషను చేరుకునేసరికి రైలు వెళ్లిపోయింది!

* * *

నాలుగేళ్ళక్రిందట - సుభద్ర స్కూలు ఫైనలూ, విశాల ఫోర్తుఫారమూ చదువుతున్నారు. తమ్ముడు థర్డుఫారం చదువుతున్నాడు. రంగనాథంగారు సామాన్య సంసారి. అతనికి సనాతనాభిప్రాయాలూ లేవు, సంస్కారభావాలూ లేవు. ఆరోజు హాయిగా గడిచిపోవడమే ఆయన ఆదర్శం.

ఇక ఆయనభార్యండి, వరలక్ష్మిగారు: ఆవిడకు మడిగా దేముళ్లకు పూజా పునస్కారాలు జరుగుతున్నంతకాలం, ఆవిడ దేవతావిగ్రహాలు తళతళ మెరుస్తున్నంతకాలం, మానవమాత్రు లేమైపోయినా ఆమెకు అక్కర్లేదు. అసలు యింట్లో ఆవిడ అభిప్రాయానికి వీసమెత్తు విలువలేదు. ఆ విలువ కావాలని ఆవిడ మనసా యాచించీ ఎరగదు.

'ఎందుకండీ యీ పిల్లల్ని యింత చదివిస్తున్నారూ?' అని ఎవరేనా అడుగుతే

'చదివించక ఏంచెయ్యమన్నారూ? ఇంట్లోది మీధర్మమా అని పదిమందివచ్చినా ఎవరం చేత్తో వండి వార్చెయ్యగలదు. మరి వీళ్లకు యింట్లో ఏంపని? అందుకనే కాస్త కష్టమయినా ఆడపిల్లలకి సహం జీతాలు కనక ఎలాగో యీడ్చుకొస్తున్నాను. ఎప్పుడు పెళ్లయితే అప్పుడు మానేస్తారు, కాస్త కట్నమయినా తగ్గుతుంది' అనేవాడాయన. అందుకనే 'మీ సుభద్రకి మొన్న హాఫియర్లీలో అంత తక్కువగా మార్కులొచ్చాయేమిటండీ, ఎవర్నైనా ప్రైవేటుమేష్టార్ని పెట్టి ప్రైవేటు చెప్పించకపోతే రేపొద్దున ఎలా గట్టెక్కుతుంది?' అని ఎవరైనా అడుగుతే ఆయనలో ఏవిధమయిన ఆత్రుతా కనిపించేదికాదు.

రంగనాథంగారికి మొదటినుంచీ సుభద్ర మీద అంత మంచిఅభిప్రాయంలేదు. చెల్లెలు విశాల అన్ని ప్రైజులూ తనే తెచ్చుకుంటూంటే - సుభద్ర ఒక్కొక్క తరగతి పాసవడమే బ్రహ్మాండమయిపోయేది. అమ్మ ఎప్పుడు యింట్లోకి రాకపోయినా ఆ మూడు రోజులూ బడి మానేసి సుభద్రే వండేది. శనాదివారాలు చెల్లెలు బీచికో, సినిమాకో తండ్రితో కలిసిపోతే సుభద్ర తమ్ముడికి నోట్సు రాసిపెట్టో, అమ్మకి బట్టలుతకడంలో సాయంచేసో, నాన్నగారి కోటు గుండీలు కుట్టో, చెల్లెలికి లేసులు అల్లిపెట్టో - యిలాంటి పనుల్లో నిమగ్నురాలై ఉండిపోయేది. ఎవరికైనా యింట్లో జ్వరంవస్తే చాలు అదింక నిద్రాహారాలు మాని అక్కడే కూర్చుండిపోయేది.

సుభద్ర అనాకారి కాదుగాని అందమయిందికాదు. ఉన్నకళ్లు చిన్నవేఅయినా వాటిలో చిత్రమయిన మెరుపు ఉండేది. ఎత్తయిన బుగ్గలూ, లావుగాఉన్న పెదవులూ ఆమెకు వికృతాన్ని అంటగడుతున్నా, మెరుస్తున్న కళ్లూ, విశాలమయిన నుదురూ - వీటినిమించి వయస్సుతో వచ్చిన సొగసూ - యివి ఆమె అనాకారితనాన్ని కప్పిపుచ్చేవి. ఇంతకన్న అనేకవిధాల విశాల లక్షణలక్షితంగా, ఆకర్షణీయంగా ఉండేది.

స్వతహా తగినంత ఆదుర్దా లేకపోయినా, యిరుగుపొరుగుల సూటి పోటుమాటలు పడలేక ఒకనాడు మొగుడ్ని కాస్త గట్టిగానే కదిపిచూసింది వరలక్ష్మి.

'ఏమండీ, విశాలకి పదహారు వెళ్లిపోయాయి. పెద్దదాని మాట సరే, పద్దెనిమిది దాటేయి. ఈ వయసుకి నే నిద్దరుబిడ్డల తల్లినయాను. ఇంట్లో పెళ్లికెదిగిన పిల్లలు కంట్లో రాళ్లలా బాధిస్తూంటే మీకు చీమకుట్టినట్టయినా లేదు. పిల్లలకి పెళ్లిళ్లు ఎప్పుడవుతాయో, ఆ వినాయకుడికి దయెప్పుడు కలుగుతుందో!'

'వినాయకుడికి కలిగేం లాభం, వియ్యంకుడికి కలగాలి గాని!'

'వస్తూంటే సరసం! ఇద్దరికీ ఒకసారి చెయ్యడమంటే...'

'అదే నేనూ ఆలోచిస్తున్నాను. విశాలకేం అదే అవుతుంది - ముందు యీ సుభద్రకి అయిందనిపిస్తే...అయినా నేను మాత్ర

# ★ సుభద్ర ★

చూస్తున్నావా లక్ష్మీ! చేసే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాను! అన్నారు రంగనాథం గారు. ఆరోజు మొదలు ఆయన మరింత శ్రద్ధతో పనిచేసేవారు. ఎక్కడెక్కడి సంబంధాలూ గాలించేవారు. ఇంకా ఆయన ప్రయత్నాలు అలా ఉండగానే ఓ దుస్సంఘటన జరిగి సుభద్ర జీవితాన్నే తారుమారుచేసింది. ఆ సంఘటన ప్రభావం ఆ యింట్లో అందరిమీదా అంతో యింతో కనపడింది.

* * *

ఒకనాటిరాత్రి వరలక్ష్మికి హఠాత్తుగా ఎవరో ఏడుస్తున్నట్టు అనిపించి మెలకువ వచ్చింది. లాంతరు పెద్దదిచేసి పెరట్లోకి వెళ్లింది. నూతిగట్టుమీద కూర్చుని సుభద్ర రెండుచేతులతోనూ మొహం దాచుకుని కష్టపడి దుఃఖం అపుకుంటోంది. వరలక్ష్మి దగ్గిరగా వెళ్లింది. సుభద్ర తల్లిని కౌగలించుకుని 'అమ్మా!' అని ఒక్కసారి వెక్కివెక్కి ఏడ్చేసింది. వరలక్ష్మి సుభద్రని విడిపించుకుని 'ఏమిటే, ఏమయిందే?' అని అడిగింది.

'పాపిష్టిదాన్ని. తప్పుచేశాను. ఎలాగే అమ్మా?' వణుకుతున్న పెదవులతో, తీవ్రంగా కొట్టుకుంటున్న గుండెతో సుభద్ర తల్లివైపు చూసింది. తల్లిచూపులో ఆమెకు ఏవిధమయిన క్షమాభావమూ కనిపించలేదు. ఆమెకు మరింత ఆత్రుత ఎక్కువైంది.

'ఏంచేశావ్? త్వరగా చెప్పవే!' సుభద్రకి ఏడుపులో దగ్గువచ్చింది. తల్లి అడిగిన ప్రశ్నకు జవాబుగా వాంతిచేసుకుంది. రెండు రోజులబట్టి సుభద్రవాలకం చూస్తే తల్లికి అనుమానంగానే ఉంది. ఇంకేం, అనుమానం దృఢపడిపోయింది! సుభద్ర కడుపుతో ఉంది! పెళ్లికాకుండా కడుపుతో ఉంది!! కుంతి, ద్రౌపది మొదలయిన పుణ్యచరిత్రలు జన్మించిన భారతభూమిలో పుట్టిన, ప్రత్యేకించి ఆడవాళ్ల సౌశీల్యమే గణిస్తే మహాపతివ్రతలు గల వంశానికి చెందిన వరలక్ష్మి - యీ వార్త నిజమని తెలియగానే నిలువునా నీరైపోయింది. ఆమె కొలిచి పూజించే దేవతలెవరూ సుభద్ర చేసినపనిని హర్షించలేదు. ఆమె కుమార్తెను ఎంత మాత్రం క్షమించలేకపోయింది. పైగా, రేపొద్దుట తనకి సంఘంలో ఏర్పడే స్థానం తలచుకునేసరికి ఆమెకే దుఃఖం వచ్చింది!

'ఎంతపని చేశావే దిక్కుమాలినదానా! ఇంతమందీ యిలా కళ్లల్లో కళ్లుపెట్టుకుని చూస్తూంటే యిలాంటి నిర్భాగ్యపు పని ఎప్పుడు చేశావే! ఎవడే ఆ దరిద్రగొట్టు వెధవ?'

ఎప్పుడూ అబద్ధమాడి ఎరగని సుభద్ర, ఎవరికైనా చిన్న ఆపద జరుగుతే మనసా విచారపడే సుభద్ర, జరిగిన 'దిక్కుమాలిన పని' అంతా తల్లిముందు వెళ్ళబోసుకుంది.

సొంతయిల్లే లేకపోతే నూటఏభై రూపాయిల జీతంతో రంగనాథంగారికి మద్రాసు నగరంలో రోజులే గడిచేవికావు. ఆ యింట్లో ఊరికే పడున్న వీధిగదిని 'ఏదైనా ఉద్యోగం చేసుకుందామని' మద్రాసు చేరుకున్న నారాయణకి పదిరూపాయిలకి అద్దెకిచ్చారు. అతనికి వచ్చిన పదిరోజులకే సుభద్రమీద విపరీతమయిన అభిమానం ఏర్పడింది. ఒకనాడు అతనికి జ్వరంవస్తే సుభద్ర పొద్దుట కాఫీ, రాత్రి జావాయిచ్చి అతని అభిప్రాయాన్ని యినుమడింపజేసింది. ఆ తరవాత ఒకరోజున, తండ్రీ చెల్లెలూ తమ్ముడూ సినిమాకీ, తల్లి పార్థసారధికోవెల్లో హరికథకీ వెళ్ళిపోయిన రోజున - ఏం తోచక ఏదైనా పుస్తకం అడిగి తెచ్చుకుందామని నారాయణ గది చేరుకున్న సుభద్ర- నా అన్నవాళ్లు లేని నారాయణ జీవితంలో నేను ఉన్నానంటూ ప్రవేశించింది.

* * *

సంగతంతా విని రంగనాథంగారు జాగ్రత్తగా ఆలోచించారు. సహజంగా ఆయనకి సుభద్రమీద ఉన్న చిన్నచూపు, అసహ్యంగా మారిపోయింది. చల్లగా, చాపకింద నీరులాఉన్న యీ దౌర్భాగ్యురాలు ఎంతపని చేసింది! కుటుంబానికి ఎంత అపకీర్తి తెచ్చింది! ఇదేమయినా అంత బాధలేదు, దీని తరవాత ఏ పాపం ఎరగని ఆ విశాల ఉందే! దాని బతుకేంగాను? దీన్నేం చేస్తే పాపముంది? - అసలు యిప్పుడేం చెయ్యాలి?

ఈ సంగతి వీలయినంత రహస్యంగా ఉంచమని వరలక్ష్మికి చెప్పినతరవాత ఆయన సుభద్రని పిలిచి మరోసారి జరిగిందంతా తెలుసుకున్నారు. నారాయణని పిలిపించి అడిగేరు. వాడి ధర్మమా అని అట్టే అల్లరి లేకుండా వాడు జరిగిన సంగతి ఒప్పుకున్నాడు. వాడి కులం తమ కులమే అని తెలిసిన తరవాత రంగనాథంగారు అయిదు నిమిషాలు ఆలస్యం చెయ్యలేదు. వారంరోజులు దాటకుండా మంచిరోజు చూసి యిద్దరికీ దేముడిగుళ్ళో పెళ్లి జరిపించేశారు. ఇంత సాహసం ఆయనకి ఎలా వచ్చిందో అని బంధువులంతా ముక్కుమీద వేలేసుకున్నారు. 'కులం బంధువులు లేరు, ఆస్తిలేదు, చదువులేదు - మాగొప్ప అల్లుణ్ణి వెతికి పట్టుకొచ్చారయ్యా రంగడు బావా!' అని ఎవరైనా అంటే 'ఇన్నీ ఉన్నవాళ్లు మహా సుఖపడి చచ్చారా? దాని అదృష్టం ఎలా ఉంటే అలా జరుగుతుంది!' అని రంగనాథంగారు జవాబు చెప్పేవారు.

'నువ్వు కలిగున్న యింట్లో, పదిమంది బంధువుల్లో పుట్టేవు. ఏ ఆఫీసర్నో పెళ్లాడి సుఖంగా ఉండవలసినదానివి. చివరికి ఈ నిర్భాగ్యుడు నీకు దాపురించేడు. నన్ను క్షమించు సుభద్రా!' పెళ్లయినతరువాత మొదటిరాత్రి మధురక్షణాలలో నారాయణ ముందుగా అన్నమాట యిది. సుభద్ర అతని కన్నీళ్ళు తుడిచింది.

'మనకు అదృష్టం ఉంటే మీరే పెద్ద ఉద్యోగం చెయ్యొచ్చు. మనకి ఎంతో సుఖంగా గడిపే శుభదినాలు రావచ్చు. మీరిలా దుఃఖపడితే నేను ఒప్పుకోనేదిలేదు - నేను మీ నీడని ఉన్నంతకాలం మీరు కంటతడి పెట్టడానికి వీల్లేదు' అంది సుభద్ర.

కళ్లెత్తి సుభద్రవైపు చూశాడు నారాయణ. అతని జీవితంలో యీ నాటికేనూ ఒక్క మంచిమాట, ఒక్క వాత్సల్య వచనం, ఒక్క ప్రేమ ప్రియసూక్తి ఎరగడు. తల్లి చిన్నప్పుడే చనిపోగా, తండ్రి చనిపోతూ ఆస్తినంతా తన సవతి తమ్ముడికి రాసిచ్చిన విషాదజీవితం అతనిది. బాగుపడదామన్నా బాగుపడే పరిస్థితులు లేక చెడిపోయినవారిలో చేరిన బతుకు అతనిది. అందుకనే అతనికి చదువుకునే అదృష్టం లేకపోయింది. హైస్కూలు చదువయినా పూర్తిచెయ్యలేకపోయాడు. ఎక్కడో ఏభైరూపాయిలు అప్పుచేసి పట్నంచేరి - నిలవ నీడలేక, గాలిపాటున రంగనాథంగారింట్లో వచ్చిపడ్డాడు. ఇక్కడ యీ అమృతమూర్తి లభించింది.

మెరుస్తున్న ఆ చిన్నకళ్లను మరోకసారి చూశాడు నారాయణ. పవిత్రజ్వాలలు వెల్లివిరుస్తున్న ఆ నేత్రద్వయంలో ఎక్కడా అసంతృప్తికి తావులేనట్టు కనిపించడం అతనికి ఆశ్చర్యమనిపించింది. సామాన్యసంసారంలో పుట్టిన స్త్రీకి కావలసినవీ, కోరుకోదగ్గవీ ఒక్కటీ సుభద్రకు లభించలేదు. వీలయినంత వేడుకగా జరగడం మాట అటుంచి, ఆమె పెళ్లికి పట్టుమని పదిమంది బంధువులయినా రాలేదు. ఖరీదయిన బట్టలు, విలువయిన నగలు - వీటి ప్రసక్తే రాలేదు ఆ పెళ్లిలో. వీటన్నిటికీ కారకుడయిన నిర్భాగ్యుడైన భర్తమీద ఏమాత్రం కంకో లేకపోగా - యింకా ఆమె సంతుష్టిగా ఉండడం నారాయణని చకితుణ్ణిచేసింది.

అతని మనస్సు ఆమెకు జోహారు లర్పించకుండా ఉండలేకపోయింది! సుభద్ర దేన్ని చూసుకుని యింత నిశ్చింతగా ఉందో అతనికి ఎన్నివిధాల ఆలోచించినా అర్థం కాలేదు.

మొట్టమొదట రంగనాథంగారింట్లో తను అద్దెకు తీసుకున్న గది, ఆ గదిలోనే నారాయణ ఉండేవాడు. అతని సామానులు - పెద్దసామాన్లేం వున్నాయి గనక? ఒక చాప చుట్టా, ఒక బొంతా, ఒక పెట్టె దాంట్లో నాలుగైదు జతలబట్టలూను! - ఇవే సుభద్ర కాస్త పొందికగా అమర్చేది. ఆ వీధిగది కిటికీలో కూర్చుంటే బజారంతా కనిపించేది. బడి మానేసినతరవాత, నారాయణ ఏదేనా పని ప్రయత్నంకోసం పొద్దుటే వీధిలోకి వెళ్లిపోయినతరవాత,ఆమెకేం తోచేదిగాదు. క్రిందకు దిగివచ్చేసరికి విశాలా తల్లీ ఏదో గుసగుసలాడుకుంటూ సుభద్రని చూసీ మానేసేవారు. సుభద్ర అడుగులో అడుగు వేసుకుంటూ తల్లిదగ్గరకు వచ్చి——

'అమ్మా ఏమయినా సాయం చెయ్యనుటే?' అనేది. తల్లి కొంగుతో కనుకొలకులు ఒత్తుకుంటూ

'ఒక్కగా నొక్క తమ్ముడు. వాడు కూడా ఉత్తరమ్ముక్క రాయడం మానేశాడు. ఇంకా ఎందుకు తల్లీ, చాలు! కుటుంబానికంతటికీ చేసిన సాయం చాలు! నిప్పులాంటి వంశం! యాదవకులంలో ముసలం పుట్టిందని...' ఇలా ఏదో మొదలెట్టేది.

ఇంక తల్లిమాటలు వింటూ సుభద్ర అక్కడ ఉండలేకపోయేది. ఒకొక్కప్పుడు విశాలకూడా తల్లికి తోడై శ్రుతి కలిపేది.

"చూశావా అమ్మా! మాట పూర్తవకుండా ఎలా వెళిపోయిందో! తప్పుచేసిన మనిషి కాకపోతే నీముందు ఎందుకు నిలబడలేకపోయిందీ? మా క్లాసులో అందరూ 'మీ అక్కయ్యేం చదీ చప్పుడూ లేకుండా యీ గాంధర్వవివాహం వేఁవిటి'ని చంపేస్తున్నారే!"

'గాంధర్వ వివాహం' అన్న యీ ముక్కకి పూర్వకాలపు తల్లికి నవ్వొచ్చింది. ఈ కాలపు చదువుకుంటున్న పిల్లకి కూడా నవ్వొచ్చింది. ఇద్దరూ కలిసి పకపకనవ్వేరు. సుభద్ర గుండెల్లో అగ్ని మంటలు రేగుతే మేడమీద 'అత్తవారిల్లు' అయిన ఆగది చేరుకుని ఏడ్చేది.

విశాలా తమ్ముడూ కూడా భోజనాలు చేసి స్కూళ్ళకి వెళ్లిపోయిన తర్వాత సుభద్ర కిందకొచ్చి ఏవో రెండు మెతుకులు కొరికేది. ఆ ఎంగిళ్ళుతీసి, యిల్లు కడిగి - అంట్లు నూతిదగ్గర వదేసిన తర్వాత ఆమె కేమీ పనుండేదికాదు. తండ్రి ఆఫీసునుంచి రాగానే మొహం కడుక్కోడానికి మరచెంబుడు చల్లని నూతినీళ్లూ, సబ్బూ, తువ్వాలూ బల్లమీద ఎదురుగా పెట్టేది. చిందరవందరగాఉంటే తమ్ముడి పుస్తకాలు సర్దేది. ఇన్ని చేసినా ఆమెకు పొద్దుపోయేదికాదు. తమ గదిలో అలా కిటికీలో చూస్తూ కూర్చునేది.

సుభద్ర ఆ కిటికీలో కూర్చునే రోజులు, వారాలు, నెలలు గడిపింది. 'ఏదైనా ఉద్యోగంకోసం' వెళ్లిన భర్త తెచ్చే మంచి కబురుకోసం నిరీక్షిస్తూ ఆమె అక్కడే కూర్చునేది. భర్త రాగానే ఆమె ఏమీ అడిగేదికాదు. అతన్ని చూసే జరిగింది తెలుసుకుని ఒక నిట్టూర్పు విడిచేది. అక్కడే, ఆ కిటికీలోనే ఆమె చేసిన తప్పుపనిని చాటిచెప్పే శిశువు నెలలుగడిచి పెద్దదై తల్లి మొహం మాలిన్యమో, మాధుర్యమో చూద్దామని తొందరపడేది.

'ఈ ప్రపంచంలో నాలాంటివాళ్లు ఎందుకు బతుకుతున్నారో తెలీదు. మన పెళ్లికిముందు అనేకమార్లు ఆత్మహత్య చేసుకుందామని ప్రయత్నించినా, ధైర్యంలేకపోయింది. ఆఖరికి నీతో విప్పరాని ముడివై నీ జీవితాన్నే నాశనంచేశాను. నా పాపం యిక్కడితోనూ అంతం కాలేదు. ముచ్చట్లూ, ముద్దులూ మన జీవితాలకు అందని అనుభవాలే అనుకుందాం. రోజు గడిచేమార్గమెలా? రేపొద్దున్న మన పాపకు మనం ఏం పెట్టుకోగలం? స్కూలు ఫైనలయినా ప్యాసవ్వని నాకు ఏంచూసి ఎవరు ఉద్యోగమిస్తారు? బంధువులే లేని వాడికి అభిమానం దేనికి? నువ్వు అడ్డు చెప్పకపోతే హార్బరులో కూలీగానో, హోటల్లో సెర్వరుగానో, బస్సులో క్లీనరుగానో చేరిపోతాను'

సుభద్ర కళ్ళమ్మట రెండు వేడినీటి బాష్పాలు నేలమీద పడ్డాయి. వేరే వెళ్ళి ఏమైనా చేసుకు బ్రతకడంలో ఆమెకేలాంటి అభ్యంతరమూ లేదు. నూటఏభై రూపాయలతో తండ్రి పడుతున్న బాధ, తమ కుటుంబబాధ్యత మరింత తోడై సంసారాన్ని యీదుకురావడంతో ఆయనకష్టం ఆమె ఊహించకపోలేదు.

చెల్లెలు చిన్నపిల్ల; ఎంతో చక్కటిది, మంచి సరదాలున్నదీ! దానిముద్దూ ముచ్చట్లు యిప్పుడు తీరకపోతే యింకెప్పుడు తీరతాయి? దాని సినిమాలకోసం, చీరలకోసం తండ్రి ఖర్చుపెట్టడంలో తప్పేముంది? పోతే తమ్ముడు! వెర్రినాగమ్మ! వాడుమొగాడూ! ఈయిల్లూ, యిందులో ప్రతిఅంశం వాడికి కాక యింకెవరికి? ఎంత ఆలోచించినా సుభద్రకి తన కుటుంబం యీయింటికి భారమైపోతోందనే బాధ ఎక్కువకాజొచ్చింది. ఆమె దీనంగా భర్తవైపు చూసింది. ఆమెకు ఆక్షణంలో భర్తమీద, జీవితంలో అభిమానమనేపదానికి పాతికేళ్ళ వరకు అర్థం తెలియని భర్తమీద, చెప్పలేనంత అనురాగం, అపురూపం కలిగింది. ఈయనేనా కూలీ, సెర్వర్, క్లీనర్!? ఎంతమాత్రం వీల్లేదు. ఈ పురుడు గడిచాక తనే ఏదోమార్గం ఆలోచించాలి.

ఏవిధంగానూ పనికిరాని భర్త అనురాగమూ, తప్పక భరించిన తండ్రిఖర్చూ, విసుక్కుంటూచేసిన తల్లిచాకిరీ - వీటితో సుభద్ర పురుడు గడిచింది.

* * *

రెండునెలలపాపకి పాలిచ్చి పడుకోబెట్టి, చూస్తూండమని భర్తకుచెప్పి సుభద్ర క్రిందకి దిగివచ్చింది. రంగనాథంగారు ఏదో ఉత్తరం రాసుకుంటున్నారు. సుభద్ర నెమ్మదిగా వచ్చి తలదించుకుని బొటనవ్రేలితో నేల రాస్తూ మెల్లిగా పిలిచింది.

'నాన్నా' రంగనాథంగారు తలెత్తి చూశారు. సుభద్ర తలవంచుకునే అంది.

'నేనెందుకూ పనికిరానిదాన్నయిపోయాను నాన్నా! ఈ కుటుంబానికి అన్నివిధాలా బరువునైపోయాను నాన్నా' రంగనాథంగారు అవుననలేదు, కాదనలేదు. నోటితో పెన్ చివర్ని కొరుకుతూ ఆశ్చర్యంగా వినసాగేరు.

'ఈ కుటుంబాన్ని యీదడానికి నువ్వు మొదట్నించీ పడుతున్న బాధలు నాకు తెలుసు. నేను, ఆయన, పిల్ల - యిందరం యింకా యీ కుటుంబానికి ఎక్కువయ్యాం. ఆయన అసమర్థతకి ఆయనా నేనూకూడా సిగ్గుపడుతున్నాం. నీ ఆశీర్వాదమే ఉంటే నేనే ఏదైనా ఉద్యోగం చేస్తాను నాన్నా!'

ఆయన ఆశ్చర్యానికంతులేకపోయింది. కళ్లు పెద్దవిచేసుకుని అన్నాడు.

'అతని ఉద్యోగమైపోయింది, ఇంక నీ ఉద్యోగం ఉండిపోయిందా?' సుభద్ర తల యింకా క్రిందికి దించేసుకుంది. తనలో తను గొణుక్కుంటున్నట్టు అంది.

'లేదు నాన్నా! ఉద్యోగం చెయ్యగలననే నమ్మకం నాకుంది. ముందు మెట్రిక్ పాసయితే ఎక్కడయినా ఏమైనా దొరకొచ్చు......సెప్టెంబరుకే కూర్చుందామని ఉంది నాన్నా...పుస్తకాలకీ ఫీజుకీ ఒక్క పాతిక రూపాయిలు...'

'అందుకేటే యీ వ్యాఖ్యానమంతా? ఆ మాట ముందే చెప్పకూడదూ? నా సంసారబాధ్యత అంతా వంటబట్టించుకొన్నదానివి - యిరవైయో తారీకున నాదగ్గర

# ★ సుభద్ర ★

పాతిక రూపాయిలు ఉంటాయని ఎలా అనుకున్నావే?'

'నీదగ్గర ఉండవని నాకు తెలుసు. ఇప్పుడే యిమ్మని నేను అడగను. జీతమందిన తరవాతే యిద్దువుగాని...'

'ఏమో అప్పుడు మాత్రం ఏం ఖర్చులొస్తాయో ఎవరు చెప్పగలరూ? బాకీలు తీర్చేసరికి చేతిలో పది రూపాయలేనా మిగలవు—ఏమో, నీ ఆలోచనేం నాకు నచ్చలేదు. అయినా చంటిపిల్లతో చదువేం సాగుతుంది?' సరిగ్గా వేళకు పాపాయి ఏడ్చింది. సుభద్ర గబగబా మేడమీదకు వెళ్ళిపోయింది. సుభద్ర మొహం చూసి నారాయణ జరిగిన సంగతి తెలుసుకున్నాడు. పొద్దుట కొత్త చీరకని పదిహేను రూపాయిలు రంగనాథంగారు విశాలకివ్వడం అతడు చూశాడు. ఈ యింట్లో జరుగుతున్న యింకా అనేక అన్యాయాలు అతడు చూస్తున్నాడు. కాని అతడు ఏ అధికారంతో ప్రశ్నిస్తాడు? భార్యదగ్గర చెప్పి ఆమెను బాధించడం అతని కసలు యిష్టంలేదు. నారాయణ సాధారణ మానవులకుండని సహనం-సుభద్ర వద్ద నేర్చుకున్నాడు. విశాల జోళ్లు చప్పుడు చేస్తూ ఎక్కడికో వెడుతోంది. సుభద్ర పైనుంచి చూసి పిలిచింది. విశాల తల పైకెత్తి చూసింది.

'విశాలా, విశాలా! చిన్న కబురు. ఒకమాటిలా రావే!'

'నా కవతల మీటింగు ఉంది. ఎందుకూ, నువ్వే యిలా రా' అంది మొహం చిట్లించి.

సుభద్ర ఏడుస్తున్న పాపని బలవంతాన మొగుడి కిచ్చి

'చూడండి - ఒక్కసారి దీన్నలా దూరంగా తిప్పి ఆడించండి - దాంతో మాట్లాడే పనుంది' అని గబగబా కిందకొచ్చింది. ఇద్దరూ విశాలగదిలోకి వచ్చారు.

'చెల్లీ! ఎప్పుడూ నిన్నేం అడగలేదు. ఈ ఒక్క కోరికా కాదనకు. నేను నాన్నతో అన్నదంతా విన్నావుగా... పాపం ఆయన నెక్కడ్నుంచి తేగలరు? ఒక్క పాతిక రూపాయిలు నీదగ్గిరుంటే యియ్యి. మళ్ళీ తప్పకుండా యిచ్చేస్తాను.'

'నాదగ్గరమాత్రం అంత సొమ్మెక్కడిదే? నాకేమైనా నీలా పెళ్లయిందా, నా మొగుడేం ఆర్జనపరుడా?' విశాల విసురుగా వెళ్ళిపోయింది. ఆ రోజు క్లబ్బులో "స్త్రీ నిస్సహాయత - తోటి స్త్రీ చూపించవలసిన సహాయం" అనే విషయంపై ఆమె మాట్లాడుతుంది!

* * *

'చూడు నారాయణా, ఈ రెండు ఉత్తరాలూ పోస్టులో పడేసి నాలుగు కార్డులు కొనుక్కురా. వచ్చేటప్పుడు బజారు కెళ్ళి ఒక వీశ వంకాయలు పట్టుకురా.' రంగనాథంగారిదగ్గర డబ్బులూ సంచీ పట్టుకుని నారాయణ బజారుకి వెళ్ళేడు. ఇలాంటి పనులు చేస్తున్నందుకు అతను ఏమాత్రమూ నొచ్చుకోడు. వాళ్లు తనకి రెండు పూటలా తిండి పెడుతున్నారు. పొద్దుటా మధ్యాహ్నం కాఫీ యిస్తున్నారు. ఏవిధంగానూ వాళ్ళకి తను సాయపడలేడు, చెప్పిన పని చెయ్యడంలో నామోషీ దేనికి?

నారాయణ యీ నమ్రతాభావం లోకువ కింద జమకట్టి ఆ యింట్లో అందరూ అతని మీద అధికారం చెలాయించేవారు.

'ఊరికే యింట్లో అలా కూర్చోకపోతే వీధిలో పాలవాడు అలా కేకలేస్తున్నాడు, ఏం, కాస్త మేడ దిగి పాలు కొలిపించుకుంటే మన ప్రతిష్టకేం భంగమా?' అనేది వరలక్ష్మి.

'బావగారు మరోలా అనుకోకపోతే, మధ్యాహ్నం ఆ స్కూల్నించి రాలేక వస్తున్నాను, కాస్త రోజూ టిఫిన్ తెచ్చిపెడితే...' అని పురమాయించేది విశాల.

మంచివాళ్లను ఎవరూ జయించలేరు. నారాయణ ఎన్ని పనులు చెప్పినా విసుక్కోలేదు. ఇన్ని పనులూ చేసి మిగిలిన కాలమంతా సుభద్రకీ పాపకీ ఏవిధంగానైనా సహాయం చెయ్యడానికి ప్రయత్నించేవాడు.

గాజు లమ్మి, వచ్చిన డబ్బుతో సుభద్ర పరీక్షకు కట్టింది. ఆమెకి చదువుమీద ఏనాడూ లేని శ్రద్ధ యిప్పుడు కలగడం చూసి యింట్లో అందరికీ ఆశ్చర్య మనిపించింది. తమ్ముడ్ని బతిమాలి ఎక్కడెక్కడినో సెకండ్ హేండ్ నోట్సు సంపాదించింది. ఒక సైడు టైపు కొట్టబడిన తెల్ల కాగితాలు నారాయణ ఎదురింటి ఆఫీసర్ని అడిగి తేగా వాటిమీద లెక్కలు చేసేది. ఆ మిగిలిన సొమ్ముతో మొగుడికి రెండు నేత పంచెలు, రెండు చొక్కాలకు సరిపడే గుడ్డా, పాపకి ఒక గౌనూ రెండు జతల రబ్బరు గాజులూ కొంది. ఇదంతా చూసి వరలక్ష్మికి మరింత అసహ్యం వేసింది. కడుపున పుట్టినదే అయినా యీ 'పాపిష్టిదాని' యీమాత్రం ఔన్నత్యం ఆమె భరించలేకపోయింది.

'దీనికీ, దీని మొగుడుకీ కూడా చాకిరీ చెయ్యడానికి నేనేం దాసీదాన్నా?' అనుకుని తను మోస్తున్న పల్లకీలో ఒకకొమ్మ సుభద్రమీద వదిలేసింది. ఆ రోజునుంచీ రాత్రిపూట వంటభారం యావత్తూ సుభద్ర మీద పడింది! అయినా సుభద్ర ఓడిపోలేదు. నారాయణకి ఎక్కువగా చాకిరీ తగుతే సుభద్రా, సుభద్రకి మరింత పని ఎక్కువయితే నారాయణా మాత్రం బాధపడేవారు! ఒకర్నొకరు ఓదార్చుకొనేవారు. ఇద్దరూ అప్పుడే అడుగుదీసి అడుగు వేస్తున్న హంసపిల్లను చూసి మురిసిపోయేవారు!

అవాళ పేపర్లో మెట్రిక్ రిజల్ట్సు పడ్డాయి. నారాయణ సంతోషాని కంతు లేకపోయింది. పిల్లనెత్తుకుని క్రిందకు దిగబోతున్న సుభద్రని గుమ్మందగ్గిరే ఆపేసి కౌగలించుకున్నాడు.

'ఇందులో నేను చేసిందేముంది? ఈ విజయం మీదే. రాత్రనక, పగలనక నాతో కూడా మేలుకుని, ధైర్యం చెప్పి - ఎన్నిసార్లయినా విసుక్కోకుండా పాపాయిని ఆడించి...'

'ఇంక చాలు - ఆపు.' సుభద్ర నవ్వింది. ఆమె చిన్నకళ్లుకూడా నవ్వేయి. పాపాయి నవ్వింది. నారాయణకూడా నవ్వేడు. ఇన్నాళ్ళకి - కాపురంలో మొదటిసారిగా - యిద్దరూ కలిసి నవ్వుకున్నారు.

'నేను మొదట చదివిన హైస్కూలు హెడ్మిస్ట్రెస్ చాలామంచిది. నేను మొన్న మాంబళం బస్సులో వస్తూంటే కనిపించింది. నేను చేసినపనికి చాలా సంతోషించింది. ఈమాట వింటే మరీ సంతోషిస్తుంది. 'ఇది గనక పాసయితే డిస్కంటిన్యూ చెయ్యకు, వెంటనే ట్రైనింగు అయిపో - నువ్వు ఏ క్షణాన్ని వచ్చినా మన హైస్కూల్లో పోస్టు ఖాళీగానే ఉంటుంది' అని చెప్పింది. కాని...' సుభద్ర ఆపేసింది.

'ఆపేశావేం, చెప్పు?'

'మరేంలేదు. ట్రైనింగుకాలేజి చాలా దూరం. మనింటికి మూడు మైళ్లయినా ఉంటుంది. ఎలాగా అని ఆలోచిస్తున్నాను'

'పొద్దుటే భోంచేసి నడిచి వెళ్లిపో .. సాయంకాలం రా'

'మరి యిది? ఇంకా ఏణ్ణర్ధమయినా లేదే నన్నువిడిచి ఉండగలదా?'

'నేను ఉన్నానుగా? దాన్ని ఆడించే పూచీ నాదీ' సుభద్ర మనస్సుకి వెయ్యి ఏనుగులబలం వచ్చేసింది. ఆమె కళ్లలో గిర్రున నీళ్ళు తిరిగి నారాయణ పాదాలమీద పడ్డాయి.

'మీకు చదువులేదు...కాని హృదయముంది' అంది ఆమె అప్రయత్నంగా.

ఆరాత్రే భోజనాలదగ్గర వరలక్ష్మి ప్రస్తావన తీసుకొచ్చింది.

'విన్నారా? ఇది ప్రైవేటుగా కూడా చదువుతుందిట'

'చదవనీ - మనకేం?'

'అంతలో ఉందన్నమాట మీకు తెలీదు. ఎంత పట్టించుకోకుండా ఏడు కొండల వాడ్ని తలుచుకుంటామనుకున్నా, యిరుగూ పొరుగూ యిప్పటికే పనీపాటూ లేనివాళ్ళని తెచ్చి యింట్లో కూర్చోపెట్టుకున్నామని దూదేకినట్టు ఏకేస్తున్నారు. ఇక యీవిడ గారు ఉద్యోగంకూడా వెలిగిస్తే, అతనికి సిగ్గులేకపోతే పోవాలిగాని - వాళ్ళని ఉంచుకోడానికి మనకేనా అభిమానం ఉండొద్దుటండీ?'

'నీ తెలివితేటలకి సంతోషించాంగాని, దానికే నిజంగా ఉద్యోగమైతే వాళ్ళెక్కడుంటారూ? అప్పుడు మనం పంపేశామని లోకనింద ఉండదుగా?'

'అవును నిజమే. నే అంతదూరం ఆలోచించలేదు. అవునుగాని పద్దెనిమిదికూడా వెళిపోతాయి, ఆ విశాలకేనా మంచి సంబంధం చూడరేమండీ? ఈ స్కూలు ఫైనలు పరీక్ష అయిపోయేసరికి - ముందుగా సంబంధం నిశ్చయించుకునివుంటే - అయిందనిపించవచ్చు. ఇంకా ఆలస్యంచేస్తే మన పెద్దమ్మాయిలాగే...'

'ఛత్ ఊరుకో! అదెక్కడ, యిదెక్కడ? విశాలకి అలాంటి యిలాంటి సంబంధం నచ్చుతుందా? అయినా అదింకా చదువుకుంటానంటే మనం కాదనగలమా?' అన్నారు రంగనాథంగారు.

* * *

రంగనాథంగారు అనుకున్నట్టే జరిగింది. సరిగ్గా ఏడాది గడిచినతర్వాత చూస్తే విశాల ప్రెసిడెన్సీ కాలేజీలో యింటర్ చదువుతోంది. సెలవుల్లో రంగనాథంగారు తీసుకొచ్చిన ఏ సంబంధమూ విశాల భావాలకు అనుగుణంగాలేదు. ఈ యిల్లు పాతికవేలకి అమ్మేసి త్యాగరాయనగర్లో మరో యిల్లు పద్దెనిమిదివేలకి కొనుక్కుని - మిగిలిన సొమ్ములో అయిదువేలదాకా కట్నానికీ మిగిలింది పెళ్ళిఖర్చులకీ పెడదామని రంగనాథంగారు అంతా సిద్ధంచేస్తే, విశాల నా కిప్పట్లో పెళ్ళొద్దు పొమ్మంది.

ఈ ఏడాదిలో యింకా అనేక మార్పులు జరిగేయి. వరలక్ష్మికి కీళ్ళవాతం వచ్చి ఆ దేముడి గదిలోనే మంచం దిగేదికాదు. సెకండరీగ్రేడు ట్రైనింగు ప్యాసయి వెంటనే ఉద్యోగం దొరికినా సుభద్రకి వంటపని తప్పిందికాదు. ఇంటిదగ్గర యీ పనితోనూ, కొత్తలో ఉద్యోగంలేని త్రొక్కుడివల్లనూ ఆమెకు క్షణం తీరికయ్యేదికాదు. ఆ రోజుల్లో ఆమె దినచర్య గమనిస్తే మిక్కిలి విచిత్రంగా ఉండేది. అది యంత్రమో మానవశరీరమో అర్థమయ్యేదికాదు.

సుభద్ర, నారాయణ ఉదయం నాలుగింటికి లేచేవారు. నారాయణ పాపదగ్గిరే ఉంటే, సుభద్ర కిందకి దిగి త్వర త్వరగా కాలకృత్యాలు తీర్చుకుని నీళ్ళ పొయ్యీ కాఫీ కుంపటీ అంటించేది. పాలు కుంపటి మీద పెట్టి నారాయణ్ణి చూస్తూండమని నీళ్ళు పోసుకుని వచ్చేది. రాగానే కాఫీ చేసేసి - కత్తిపీట ముందేసుకుని కూరలు తరుగుతూ ఉండేది. పక్కనే భర్తతో కబుర్లు చెబుతూంటే ఆమె కపని చేస్తున్నట్టే ఉండేది కాదు.

'నిజంగా నాలాంటి అదృష్టవంతురాలు లేదు. మీలా ఎవరువచ్చి సాయంచేస్తారు?'

.........

'ఇలాంటప్పుడు అమ్మని విడిచిపెట్టి ఎక్కడికి వెళ్ళను? చెల్లాయి చిన్నదీ - దానికేం తెలుసు! అది చిన్నప్పట్నుంచీ ముద్దుగా పెరిగింది ... శ్రద్ధగా చదువుకుంటోంది. ఇలాంటప్పుడు వంటపని అప్పచెప్తే అదేం చెయ్యగలదు?...

'ఫస్టుతారీఖు రాగానే నా జీతం జీతంలా నాన్న చేతిలో పెట్టేస్తున్నాను. చెల్లాయి పెద్దచదువులు చదువుతోంది. దానికేం తక్కువవుతుందా? నాన్నకి ఆమాత్రమేనా సాయం చెయ్యకలుగుతున్నానని నాకెంతో తృప్తిగావుంది?...

'ఇంకోళ్ళయితే నేను మొదటచేసిన పాడుపనికి యింట్లోంచి గెంటేద్దురు. మొహమొహాలు చూసుకోకుండా చేద్దురు. కాని నాన్న నన్ను ఆదరించి పెళ్ళిచేశారు. ఆయన ఋణం ఎన్నిచేస్తే తీరుతుంది?..."

ఇలా ఏవేవో సుభద్ర చెప్పుకుంటూ పోయేది. నారాయణ ఆశ్చర్యంగా వినేవాడు.

'ఇద్దరు పిల్లలు ప్రైవేటు చెప్పించుకుంటామన్నారు. వాళ్ళిచ్చేజీతాలతో మనపై ఖర్చులకి చాలు'

నారాయణ, ఆశ్చర్యాని కంతులేకపోయింది.

'ప్రైవేట్లుకూడా ఎక్కడ చెబుతావ్? టైమేదీ?'

'మనకుంటే మార్గమేలేదూ? మీరుండగా నాకు తీరికలేదూ?' సుభద్ర నవ్వేది. ఈలోగా తల్లీ తండ్రీ లేచేవారు. వాళ్ళిద్దరకూ కాఫీలిచ్చి, తమ్ముడికీ విశాలకీ కాఫీలు ఫ్లాస్కులోపోసి, పాపాయికి పాలిచ్చివచ్చి సుభద్ర మడిగట్టుకొనేది. ఎనిమిదిన్నరకి




మరియు ప్రతి బిళ్ల ఎంతో కాలము వచ్చును కనుక హమాం కుటుంబ దబ్బును ఆదాయము వేయును!
అది మంచి సబ్బు అని మీకు నిశ్చయముగ తెలుసు ఎందుకంటె అది టాటా తయారు.
A TATA PRODUCT
ఇండియా పెట్టుబడితో, ఇండియా నిర్వాహణ క్రింద, ఇండియాలోనే తయారవుతున్నది.
టాటా స్పోర్ట్స్ రెవ్యూ ప్రతి మంగళవారము, లక్ష్మివారము, శనివారముల రాత్రి 9 గంటలకు రేడియో సిలోన్‌లో వినండి
TS 9772 (R)

# ★ సుభద్ర ★

వంటయిపోయేది. తనుమాత్రం గబగబా భోంచేసి, చిన్న కేరియర్లో మధ్యాహ్నానికి మజ్జిగాన్నం సర్ది ఉంచుకునేది. ఈ లోగా జడవేసుకుని - ఒక్క పదినిముషాలు పాపాయితో ఆడుకుని ... దాన్ని అలంకరించి ... 'యిప్పుడే అలా వెళ్ళి వస్తాన'ని చెప్పి ... నాలుగడుగులు నడిచి సందుచివర మాయమయ్యేది. ఆవిడభర్త, గ్రమా అని వరలక్ష్మమాత్రం మిగిలినవాళ్ళకి వడ్డించేది. ఆరోజుకి కావలసిన బజారు సామానులూ, వరలక్ష్మికి మందులూ, యింట్లో పాపాయి సంరక్షణా నారాయణ చూసుకొనేవాడు. సుభద్ర సాయంకాలం అయిదింటికి వచ్చి ఆరింటివరకూ ప్రైవేట్లు చెప్పి-తర్వాత వంటపని చూసుకునేది.

ఒకనాడు - సాయంకాలంవేళ - విశాల చల్లగాలికి డాబామీద కూర్చుంది. తనకు తెలియకుండా తనలో యిదివరకు యిమిడి ఉన్న ఏదో ఒక అసంతృప్తి - పదిరోజుల్నుంచీ మరీ ఆందోళన కలిగించ నారంభించింది. ఈ చదువులూ, క్లబ్బులో ఉపన్యాసాలూ, ఆమె కేవిధంగానూ తృప్తి నియ్యలేకపోయాయి. ఎదురుగుండా కిటికీలో నారాయణ, పాపాయితో ఆడుకోడం స్పష్టంగా కనిపిస్తోంది. ఆ చిన్నపిల్లతో ఒకమారు ఆడుకుంటే మనస్సెంతైనా తేలిక పడుతుందని ఆమె కనిపించింది. కాని ఆమె అక్కకూతుర్ని ఎత్తుకోడానికి యిష్టపడలేకపోయింది. 'పెళ్లాం చేత పోషింపబడుతున్న యీ దిక్కుమాలిన వాడి'దగ్గరకు వెళ్లడానికి ఆమెమనస్సు అంగీకరించలేదు. సరిగ్గా అదేవేళకు క్లబ్ బంట్రోతు వచ్చాడు. ఆవాళ ఆమె 'కన్యలు - చిత్తస్థైర్యము' అనే విషయం మీద మాట్లాడాలి. ఆమెకు ఆ హెడ్డింగు కాగితంపై చూడగానే మనసులోనుండి ఎవరో ప్రశ్నిస్తున్నట్టయింది. తలనెప్పివంక పెట్టి వాడ్ని పంపివేసింది. ఆమె హృదయం ఆమెను ప్రశ్నించడం మానలేదు. ఇంతలోనే సుభద్ర డాబామీదకు వచ్చింది.

'ఇక్కడున్నావుటే, ఇల్లంతా వెతుకుతున్నానూ? చూడు విశాలా రేపు మా స్కూల్లో నాటకం. నే వచ్చేసరికి పొద్దుపోతుంది. రేప్పొద్దుటే నేను రాత్రికూడా అన్నం వండేసి వెళిపోతాను. నాన్న కూర లేకపోతే విసుక్కుంటారు. నువ్వు ఏదైనా వేపుడు చేసి...'

విశాలను ఆ యింట్లో ఎవరూ యిప్పటికి పొయ్యిదగ్గరకు వెళ్లమనలేదు. ఈనాడు ఈవిడగారు ఉద్యోగం చేస్తున్నాననే గర్వంతో...అలా ఆమె ఊహాలు పరుగెత్తేయి.

'నాకేం చేతకాదక్కా, నువ్వే పొద్దుట అన్నీ చేసి వెళిపోదూ ..' అనేసింది అటు తిరిగి.

సుభద్ర మరేం మాట్లాడకుండా క్రిందికి వెళ్లిపోయింది. అక్కడే అనేక ఆలోచనలతో విశాల చీకటిపడేదాకా గడిపింది. సుభద్ర మేడమీదకు వచ్చినపుడు తన గురించి బావతో ఏం చెబుతుందో ఆమెకు వినాలనిపించింది. డాబా చివరకి వచ్చింది.

'నిజంగా దానికేం వంట చేతకాదు. కాలేజీగొడవ తప్పితే చెల్లాయికేం తెలుసూ, చిన్నపిల్లా! వంటే వచ్చిఉంటే అది ఒక్కనాటికి నన్ను చెయ్యనిచ్చేదా?'

విశాల చెవుల్లోంచి ఈ మాట ఎంతసేపయినా పోలేదు. ఆమె కారాత్రి నిద్రపట్టలేదు.

* * *

మనస్సుకున్న వేగం శరీరానికి లేదు. అంత కష్టపడి సుభద్ర మనస్సా పనిచేస్తున్నా, ఆమె శరీరం అంత కష్టానికి ఓర్వలేకపోయింది. ఆమె త్వరలోనే జబ్బు పడిపోయింది- మొదట్లో కొద్దిగా జ్వరమొస్తున్నా ఆమె లెక్కచెయ్యక తన పనులు చేసుకోనారంభించింది. కాని ఆమె జ్వరం తగ్గలేదు. క్రమంగా ఆమె మంచంమీద పడుకోక తప్పలేదు. వరలక్ష్మి విసుక్కుంటూ చాకిరీ చెయ్యకా తప్పలేదు. 'ఆఖరికి నా కర్మకాలి అష్టమైనవాళ్లకీ చాకిరీ చెయ్యవలసివస్తోంది' అంది ఒకసారి. ఈ మాటకి ఎందుకో విశాలకి కష్టమనిపించింది. తల్లిని గట్టిగా 'నాకు జబ్బుచేస్తే ఇలాగే విసుక్కుంటావుటే?'అని అడుగుదామనుకొంది. కాని ఆమె అభిమానం అడ్డొచ్చింది. 'నేనూ సుభద్రా ఒకటెలా ఔతాం?' అనుకుంది.

'ఏంచేస్తానూ, నా కర్మ నాయనా యిదంతా...పద భోజనానికి' అని అత్తగారు అదోలా చూస్తూ అన్నప్పుడు మాత్రం అతి సహనభావం అలవరుచుకున్న నారాయణకికూడా మనసు కెలికినట్టయేది. వీవో పేరుకి రెండు మెతుకులుకొరికి లేచిపోయేవాడు.

'ఇలా చూడండి...మా అమ్మ పెద్దదీ, జబ్బుమనిషీ...ఒకవేళ ఏదయినా అన్నా మీరేం అనుకోరు. మీ స్వభావం నాకు తెలుసు...మీరు కడుపునిండా భోంచెయ్యకపోతే నామీద ఒట్టే...ఇలా తిరగండి, మీకు మంచి కబురు చెబుతానూ, మా హెడ్‌మిస్ట్రెస్ మొన్న ఏమందో తెలుసా? టైపు లోయర్ గ్రేడ్ పాసయినా సరేటు, మీకు ఉద్యోగం యిప్పిస్తానంది. ఈ వేసవిశెలవల్లో మీరు తప్పకుండా టైపు నేర్చుకుందురుగాని, ఏం?'

సుభద్ర యీ మాటలు అంటున్నప్పుడు నారాయణ అటువైపు తిరిగి కన్నీళ్లు తుడుచుకునేవాడు. పాపాయిని దగ్గరగా తీసుకునేవాడు. సుభద్ర కష్టపడి నవ్వేది.

'ఏమి టాలోచిస్తున్నారు? నావైపు తిరగండి, యిలా చూడండి'

'నే నీ యింట్లో యింక క్షణం ఉండదల్చుకోలేదు. ఏమాత్రం ప్రత్యుపకారం లేకపోయినా సంతృప్తిపడే నీలాంటి దివ్యహృదయం నాకు లేదు...రెండ్రోజులై నీకు జ్వరం. బాగా ఎక్కువగా వస్తోంది. అంతకు ముందు మూడురోజులై ఉంది. ఒక్కసారైనా నువ్వెలా ఉన్నావో అని మేడమీదకు వచ్చారా?' నారాయణ రెండు చేతులతోనూ మొహం కప్పుకున్నాడు. వేళ్ళ సందులనుంచి కన్నీటి చుక్కలు సుభద్ర బుగ్గమీద పడ్డాయి. కాస్సేపు ఆగి నెమ్మదిగా అంది.

'మీ రింత చిన్నవిషయానికి మనసు పాడుచేసుకుంటారనుకోలేదు. నాకు జ్వరం ఎక్కువైందని వాళ్ళకి తెలిసిఉండక పోవచ్చు - అయినా మీ రిలా చిన్నపిల్లాడిలా ఏడుస్తే నేనేం ధైర్యం చెప్పనూ? నేను మరేమీ అయిపోను...రేపటికే తగ్గిపోతుంది'.

మూడోరోజు సాయంత్రం విశాల అడుగులో అడుగువేసుకుంటూ నెమ్మదిగా మేడ ఎక్కి అక్కగదిలోకి వచ్చింది - ఇంకా పక్కదగ్గరకి రాకుండానే—

'కాలేజీ, క్లబ్బూ మానుకుని ఏమంత మించిపోయిందని అక్కగార్ని చూడ్డానికి వచ్చావ్?' అనేశాడు గబుక్కున నారాయణ. విశాల అహంకారం దెబ్బతింది.

'నే అందుకోసం ఏంరాలేదు' అనేసి గబగబా మేడదిగి వెళ్లిపోయింది. నారాయణ ఒక్కసారి నిర్లక్ష్యంగా అటు చూసి సుభద్రకు మందిచ్చాడు.

'ఈ ఆసుపత్రిమందు వద్దంటే వినవ్ - ఇలా యింకా ఎన్నాళ్ళు చేసి ప్రాణం మీదకు తెచ్చుకుంటావ్? వెళ్లి పెద్దడాక్టర్ని పిల్చుకొస్తాను'

నారాయణ బయలుదేరుతూంటే సుభద్ర చొక్కా పట్టుకుని ఆపేసింది.

'వద్దు - నాన్నకి మళ్లీ ఖర్చు. అదే తగ్గిపోతుంది' అంది. ఈమాటలు మెట్లుదిగు



అమ్మవారు

తున్న విశాలనింది. ఆమె గుండెల్లో బాణం గుచ్చుకుంది. 'అక్కకేం కావలసినా నే నిస్తాను - పెద్దడాక్టర్ని తీసుకరా బావా!' అని అందామని ఆమె తిరిగి అక్క గది వైపు రెండుమెట్లెక్కింది. సుభద్ర మాట వినకుండా పెద్ద డాక్టరుకోసం బయలుదేరిన నారాయణ అప్పుడే తలుపు తీశాడు.

'ఇప్పు డెలాఉంది బావా?' అంది విశాల.

'ఎలాఉంటే నీకేం? నువ్వు అందుకోసం రాలేదుగా!?' నారాయణ గబగబా మేడ దిగి వెళ్లిపోయాడు. విశాల మొహం ఎర్ర బడింది. అంతకన్న త్వరగా క్రిందకి దిగి వచ్చింది.

'ఎలా ఉంధే?' అని తల్లీ తండ్రీ ఒక్క సారే అడిగారు.


'బాగానే ఉంది! మరేం ప్రాణపోని లేదు!' అంది వెటకారంగా అక్కని చూడని విశాల. కాని విశాలమాటలు నిజంకాలేదు. ఆ మరునాడురాత్రే సుభద్ర నిర్భాగ్యు డైన బావనూ దిక్కుమాలిన పాపనూ యీ పాడులోకానికి అప్పజెప్పి నక్షత్ర మండ లంలోకి వెళ్లిపోయింది! ఆ పవిత్ర హృద యానికి సమీపించడానికైనా సాహసంలేక అమ్మా నాన్నా అంతదూరంలో ఎందుకూ పనికిరాని చూపులు చూస్తూవుండగా-అక్క బావ బుగ్గల్ని రెండుచేతుల్తోనూ పట్టుకుని ఏమంది? 'నేను మిమ్మల్ని యీ లోకానికి అప్పజెప్పి ఎక్కడికీ వెళ్లిపోను. నేను చచ్చి పోను, చచ్చిపోను బతికేఉంటాను!' చివరి దాకా అక్క ప్రాణం బావకోసం పాపాయి కోసం గిలగిల తన్నుకుంటూనే ఉంది.

'మీరలా ఏడవకండి... నేను ఉద్యోగం చేసి పోషిస్తున్నా ఏనాడూ మీ హృదయం తక్కువతనాన్ని గురించి బాధపడలేదు... మీరే ఉద్యోగం చేద్దురుగాని... హైపుపరీక్ష కట్టి పాసై మా స్కూల్లో క్లర్క్‌గా పనిచే ద్దురుగాని! నేను మిమ్మల్ని వదలను - వదల లేను! మన్నిద్దర్నీ ఎవ్వరూ వేరుచెయ్య లేరు!'

'నాన్నా! చిన్నతనంలో తెలియక తప్పు పనిచేసినా క్షమించి ఆదరించావు. నేను నీ కేవిధంగానూ రుణం తీర్చుకోలేకపో యాను. పిల్లలు తప్పుచేస్తే పెద్దవాళ్లే క్షమిం చాలి. నన్ను మరొకసారి క్షమించు నాన్నా!'

నాన్న కన్నీళ్లు తుడుచుకున్నారు. అమ్మ ఆడది కాబట్టి విలువలేని ఏడుపు ఒకటి ఏడ్చింది. నాన్న గడుసువాడూ, అమ్మ పూర్వకాలపుదీ! వీళ్లకి హృదయాలు లేవు! చదువుకొన్న తనకు? ఒకనాడు అక్కని తనతో పోల్చడానికి నిరాక రించిన విశాల, యీనాడు తన్ని అక్కతో పోల్చుకోడానికి సిగ్గుపడుతోంది!

అక్క! అక్కని తలుచుకోడానికేనా తనకు అర్హత ఉందా? ఈ ప్రపంచంలో కొందరు ఒకళ్ళకు చెయ్యడానికే పుడతారు. అక్క అలాంటిదే. అక్క పెద్దపెద్ద పుస్త కాలేం చదువుకోలేదు. కాలేజీ చదువు చదవలేదు. బల్లలుగుద్ది ఉపన్యాసాలు యివ్వ లేదు. అయినా అక్క జీవితాన్ని చూస్తే ఆమెకు అలవడని ఉత్తమసంస్కారం లేదు. దిక్కులేనివాడిని మనస్ఫూర్తిగా పెళ్లా డింది. చేతకానివాడ్ని మనస్సా జీవి తాంతమూ ప్రేమించింది. ఏకొడుకూ వహిం చని తండ్రి బాధ్యతంతా తనే వహించింది. కష్టపడి చదువుకుని ఉద్యోగంచేసి తండ్రికీ భర్తకీ చిరునవ్వుతో తోడ్పడింది! ఓటమి లేని జీవితం అక్కది! స్వార్థమెరుగని



“కొండదాపునా గోవులు కాచిన
కొండొక శిశువుకు గొబ్బిళ్లో”

—ఫొటో: నాళం కామేశ్వరరావు.

## ★ సుభద్ర ★

త్యాగం అక్కది! అక్క చచ్చిపోనేలేదు! దాని కెన్నటికీ చావులేదు! తను?

మళ్లీ ఏడుపుకున్నది. క్లబ్బులో వారం వారం ఉపన్యాసాలిస్తుంది. క్లబ్బు ప్రెసిడెంటుకూడాను! తోటిసోదరి గర్భవతి అని తెలిసినప్పుడు పకపక నవ్వుతుంది! ఆ అక్క చేతా, ఆఖరికి బావచేతకూడా చివరివరకూ సేవ చేయించుకుంది! ఆ బావ దుఃఖక్షణాలలో ఉన్న నాలుగుముక్కలూ అంటే అభిమానపడి చేజేతులా అక్కను బలియిచ్చింది! తను ఆ అక్కపాదాలదగ్గిర సిగ్గుతో తల బ్రద్దలు కొట్టుకుని చనిపోకపోయిందా? ఏవిధంగానూ ఎవరికీ ఉపయోగపడని తను బ్రతికేఉందా?

పాతస్మృతులు జ్ఞాపకంవచ్చి, సంఘటనల స్ఫురణ పశ్చాత్తాపం తెచ్చి - నాలుగు రోజులు పిచ్చెత్తినట్టు బాధపడినతరవాత విశాలకు ఒకనాటిరాత్రి ఒక వింత ఆలోచన వచ్చి కొంచెం సేద దీర్చింది. తను బావను పెళ్లాడితే? బావకన్న మంచిహృదయం తనకి ప్రపంచంలో దొరుకుతుందా? ఇంత కన్న అక్క ఋణం యింకేవిధంగా తీర్చుకో గలదు? ఇంకేవిధంగా తనలోని అగ్ని జ్వాలలు చల్లారుతాయి?

పిచ్చిబావ! సముద్రంలో రత్నంలా తమ యింటికి కొట్టుకొచ్చిన వెర్రిబావ! అక్క మరణంతో పిచ్చివాడై నాలుగురోజుల్నుంచి గదిలో గుండెలు బ్రద్దలయేలా విలపిస్తున్న నారాయణబావ! ముందు ఆ కాళ్లమీదపడి మనస్సులోని మాలిన్యమంతా కన్నీళ్లలో కరిగిపోయేలా ఏడవాలి! తరవాత క్షమించ మని ప్రార్థించాలి! ఆఖర్ని తన్ని స్వీకరించ మని వేడుకోవాలి! బావ తన్ని క్షమిస్తాడా? స్వీకరిస్తాడా??

విశాల నెమ్మదిగా మేడమెట్లు ఎక్కింది. ఒణుకుతున్న వేళ్లతో గదితలుపు తోసింది. తలుపులు తెరుచుకున్నాయ్. బావ లేడు! కిటికీలో లాంతరుక్రింద ఉత్తరం గాలికి రెపరెప కొట్టుకుంటోంది.

“విశాలా, ఈ యింట్లో ఎవరైనా హృదయమంటూ ఉన్నవాళ్లుంటే, అది నువ్వే అని నాకు తెలుసు గనక నీకే యీ ఉత్తరం రాస్తున్నాను. నాలుగేళ్లక్రిందట వట్టి చేతులతో నే నీ యింటికి, ముఖ్యంగా యీ గదిలోకి వచ్చాను. తిరిగి యివాళ నా దివ్యజ్యోతి నా కిచ్చిన స్మృతిచిహ్నాన్ని నా పాపాయిని తీసుకుని వెళ్లిపోతున్నాను. విశాలా, మీ అక్క చచ్చిపోలేదు. నేను బ్రతికున్నంతవరకే కాదు, హృదయమున్న మానవు లున్నంతవరకూ దాని చరిత్ర శాశ్వతమై ఉంటుంది. మీ అక్క నా కెన్నో నేర్పింది. నువ్వు కూడా ఏమైనా నేర్చు కుంటే అదృష్టవంతు రాలివి. ఇంకేం రాయను?

బావ.’

విశాలమనస్సు వికసించేసరికి అంతా మించిపోయింది. ఆమె స్టేషను చేరుకునే సరికి రైలు వెళ్లిపోయింది! ★